

ప్రైవేట్‌ను వదిలి.. ప్రభుత్వ బడికి

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా ప్రమాణాలు మెరుగుపడ్డాయి. దీంతో ప్రైవేట్‌ను వదిలి విద్యార్థులు ప్రభుత్వ బడికి వస్తున్నారు. 8లో



టమాట కిలో రూ.33

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.33 పలికింది. కనిష్టంగా రూ.16, సరాసరి రూ.25 చొప్పున విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.8°/ 23.4°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

తుంగభద్ర జలాశయానికి తగ్గిన ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గుముఖం పట్టింది. ఈ నెల ఒకటో తేదీన ఇన్‌ఫ్లో 40 వేల క్యూసెక్కులు ఉండగా ఆదివారం నాటికి 706 క్యూసెక్కులకు పడిపోయింది. శివమొగ్గ, మలెనాడు, ఆగుంబే, తీర్థనహళ్లి, శృంగేరి, వరనాడు, చిక్కమంగళూరు తదితర డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో 1,633 అడుగులతో 105.788 టీఎంసీల పూర్తి స్థాయి మట్టానికి గాను ఆదివారం నాటికి 1,627.54 అడుగులతో 85.113 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాంకు ఇన్‌ఫ్లో 706 క్యూసెక్కులు ఉండగా.. అవుట్‌ఫ్లో 10,207 క్యూసెక్కులు ఉంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,285 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

కోమాలోనే డీఈఓ సాయిరామ్



రాప్తాడురూరల్: జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.సాయిరామ్ ఇంకా కోమాలోనే ఉన్నారు. 72 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉండాలని బెంగళూరు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శనివారం సాయంత్రం అపస్మారక స్థితిలోకి వెళ్లిన డీఈఓకు అనంతపురంలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అర్ధరాత్రి బెంగళూరులోని ఆస్టర్ సీఎంఐ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం జిల్లా నుంచి డిప్యూటీ డీఈఓ, అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు పలువురు ఎంఈఓలు, సమగ్ర శిక్ష కార్యాలయ ఉద్యోగులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది బెంగళూరుకు వెళ్లారు. డీఈఓకు చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడారు. గుండె, బ్రెయిన్‌కు రక్తం సరఫరా చేసే కొన్ని వాల్వ్‌లు బ్లాక్ అయినట్లు వైద్యులు గుర్తించారు. గతంలోనే ఇందుకు సంబంధించిన శస్త్రచికిత్సలు చేయించుకున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం కోమాలో ఉన్నా చికిత్సకు సహకరిస్తున్నారు. బీపీ, పల్స్‌రేటు సాధారణంగానే ఉన్నట్లు విద్యాశాఖ సిబ్బందికి వైద్యులు తెలియజేశారు. ఇప్పుడిప్పుడే చెప్పలేమని కాస్త సమయం పడుతుందని స్పష్టం చేశారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీ కంఠం సర్కిల్: నేర ప్రవృత్తి వీడి సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం పోలీసు పరేడ్ మైదానంలో జిల్లాలో కరడుగట్టిన రౌడీషీటర్లకు ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. గత నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులపై ఆరా తీశారు. మీరు ఏ తప్పుడు చేసినా పోలీసులకు తెలిసిపోతుందనే విషయం గుర్తుంచుకోవాలని ఎస్పీ అన్నారు. పాత పంథానే కొనసాగిస్తే పీడీ యాక్ట్, జిల్లా బహిష్కరణ తథ్యమని హెచ్చరించారు. రౌడీషీటర్లు బుద్ధిగా జీవించాలని, లేదంటే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసాదరెడ్డి, జీవీ శివారెడ్డి, సీఐలు జాకీర్ హుస్సేన్, ఇందిర, విజయభాస్కర్ రెడ్డి, రెడ్డెప్ప, శివరాముడు, ప్రతాప్‌రెడ్డి, అస్రార్ బాషా, నరేంద్రరెడ్డి, నాగర్జునరెడ్డి, ఆర్ఎస్ఐ రాజశేఖరరెడ్డి, ఎస్ఐలు సుధాకర్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, రుష్యేంద్రబాబు, దిలీప్ కుమార్, శ్రీనివాసులు, దుగ్గిరెడ్డి, రాజశేఖర్, గంగాధర్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే పట్టం





దేవుని ఉప్పలపాడు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కాటమయ్యకు డిక్లరేషన్ అందిస్తున్న అధికారి

- పంచాయతీ ఉప ఎన్నికల్లో ప్రభంజనం
- 33 వార్డు, రెండు సర్పంచ్ స్థానాలకు ఉప ఎన్నిక
- 12 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఏకగ్రీవం.. మరో 6 చోట్ల ఘన విజయం
- దేవుని ఉప్పలపాడు సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కాటమయ్య ఏకగ్రీవం

అనంతపురం: గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయ దుందుభి మోగించారు. ఎన్నిక ఏదైనా, ఎపుడు వచ్చినా విజయ పరంపర కొనసాగుతూనే ఉంటుందని మరోమారు రుజువైంది. తాజాగా జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ స్పీడుకు ప్రత్యర్థి పార్టీలకు పరాభవం తప్పలేదు. టీడీపీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, ఓటర్లు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సంక్షేమం అందించే దిశగా జగన్ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుండడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ.. వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి పట్టం గట్టారు.

18 స్థానాలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులవే..

జిల్లా వ్యాప్తంగా 33 పంచాయతీ వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో 20 ఏకగ్రీవమయ్యాయి. 12 స్థానాలను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు. ఎనిమిది చోట్ల టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. 12 వార్డు స్థానాలకు పోలింగ్ జరగగా ఆరుగురు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, ఐదుగురు టీడీపీ మద్దతుదారులు గెలుపొందారు. గుంతకల్లు మండలంలో ఒక చోట తటస్థుడు విజయం సాధించారు. యాడికి మండలం వెంగన్నపల్లి పంచాయతీ ఐదో వార్డు మెంబర్ స్థానానికి పోటీచేసిన ఇద్దరు అభ్యర్థులు నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఇక్కడ ఎన్నిక జరగలేదు. మొత్తం మీద 33 స్థానాలకు గాను 18 స్థానాలను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు. టీడీపీ మద్దతుదారులు వార్డు సభ్యులు చనిపోయిన చోట మానవతాదృక్పథంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పోటీ చేయలేదు. దీంతో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవం అయ్యాయని, లేకుంటే ఇక్కడా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే గెలిచి ఉండేవారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- జిల్లాలో రెండు చోట్ల పంచాయతీ సర్పంచ్ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఇందులో పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడులో సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కాటమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో తాడిపత్రి నియోజకవర్గంలోని జేసీ బ్రదర్స్ (దివాకర్‌రెడ్డి - ప్రభాకర్‌రెడ్డి) సొంత మండలం పెద్దపప్పూరులో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలినట్లయ్యింది. క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ జనామోదం పొందడమే కాటమయ్య విజయానికి నిదర్శనం.

ఇంటింటా సంక్షేమ కాంతులు

సచివాలయ - వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అర్హులందరికీ పథకాలు అందేలా కృషి చేస్తుండడంతో గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరిగింది. నేరుగా ప్రజల్లోకి వెళ్లి తాము చేసింది చెప్పే ధైర్యం గతంలో ఏ పాలకులకూ లేదు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో గ్రామస్థాయిల్లో అరాచకాలకు తెరతీశారు. అస్మదీయులకే సంక్షేమ పథకాలు అందిస్తూ పక్షపాతం ప్రదర్శించారు. అప్పటి ప్రభుత్వ పాలన, ఇప్పటి పారదర్శక పాలనను ప్రజలు బేరీజు వేసుకుని సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారనే దానికి తాజాగా వచ్చిన గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనం.

వార్డుల్లో ఏకగ్రీవమైన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు

మండలం	పంచాయతీ/వార్డు	అభ్యర్థి పేరు
ఉరవకొండ	నెరిమెట్ల/7	తలారి సుంకమ్మ
శింగనమల	వెస్ట్‌నరసాపురం/3	వరికూటి రామచంద్ర
యల్లనూరు	పాతపల్లి/6	భూమిరెడ్డి కేశవరెడ్డి
గుత్తి	ఇసురాళ్లపల్లి/2	లక్ష్మీకాంతమ్మ
గుత్తి	అబ్బేదొడ్డి/2	నిట్టూరు ఖాసీంపీరా
తాడిపత్రి	దిగువపల్లి/9	రామచంద్రారెడ్డి
యాడికి	నగరూరు/1	విజయ్‌కుమార్‌రెడ్డి
పెద్దపప్పూరు	చిన్న ఎక్కలూరు/8	సత్యంరెడ్డి
బొమ్మనహాళ్	శ్రీధరఘట్ట/3	హనుమంతప్ప
బొమ్మనహాళ్	బొల్లనగుడ్డం/3	వెంకటేశులు
కంబదూరు	గొల్లపల్లి/7	గొల్ల శ్రీకాంత్
రాప్తాడు	ప్రసన్నాయపల్లి/2	సాకే ఆదిలక్ష్మి

వార్డుల్లో గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు

మండలం	పంచాయతీ/వార్డు	అభ్యర్థి పేరు
గార్లదిన్నె	బూదేడు /9	వడ్డే సుంకమ్మ
యల్లనూరు	బొప్పేపల్లి/3	మంజుల లీలావతి
గుత్తి	లచ్చానుపల్లి/7	సుగుణమ్మ
గుత్తి	చెర్లోపల్లి/4	పుల్లన్న
పెద్దవడుగూరు	జి.వెంకటాంపల్లి/4	కె.లక్ష్మీదేవి
యాడికి	యాడికి/19	శ్రీరాములు

ఏకగ్రీవంగా గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు



తలారి సుంకమ్మ, వరికూటి రామచంద్ర, భూమిరెడ్డి కేశవరెడ్డి, లక్ష్మీ కాంతమ్మ, నిట్టూరు ఖాసీమ్ పీరా, ఎద్దుల రామచంద్రారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, సత్యంరెడ్డి, వెంకటేష్, హనుమంతప్ప, గొల్ల శ్రీకాంత్, సాకే ఆదిలక్ష్మి

గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు



వడ్డే సుంకమ్మ, మంజుల లీలావతి, సుగుణమ్మ, పుల్లన్న, కె.లక్ష్మీదేవి, శ్రీరాములు

వీరులను స్మరించుకోవాలి



అమృత్ కలశాన్ని అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ,



మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

- మహనీయుల త్యాగఫలితమే స్వేచ్ఛా ఫలాలు
- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- కలెక్టరేట్‌లో నా భూమి- నా దేశం కార్యక్రమం

అనంతపురం అర్బన్: రెండు శతాబ్దాల పరాయి పాలనలో మగ్గిన దేశాన్ని రక్షించుకునేందుకు ఎందరో వీరులు, యోధులు, సైనికుల రక్తంతో తడిసిన ఈ మట్టి చాలా పవిత్రమైనదని, వారి త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛాఫలాలు అని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అలాంటి వీరులను అనునిత్యం స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆదివారం కలెక్టరేట్ ఆవరణలో 'నా భూమి- నా దేశం' కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ నిర్వహించింది. ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య హాజరయ్యారు. అమృత్ వాటిక వద్ద 'అమృత్ కలశ్ - మిట్టీ కలశ్' పూజలు నిర్వహించారు. 'నా భూమి- నా దేశం' కింద నిర్వహించిన నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం' శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దేశ రాజధానికి తరలించేందుకు జిల్లా నుంచి సేకరించిన మట్టితో కూడిన అమృత్ కలశాన్ని ఎంపీకి కలెక్టర్ అందజేశారు. అనంతరం భూమికి వందనం చేస్తూ పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులకు, వీరమరణం పొందిన సైనికుల కుటుంబ సభ్యులకు శాలువా కప్పి సత్కరించారు. వసుధకు వందనం కింద మొక్కలు నాటారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ. దేశమంటే మట్టి కాదోయ్ అని గురజాడ అప్పారావు అన్నారని... అయితే దేశమంటే మట్టే అని అన్నారు. పరాయి పాలనలో మగ్గిన ఈ దేశాన్ని రక్షించేందుకు ఎందరో వీరులు తమ రక్తంతో ఈ మట్టిని తడిపారన్నారు. ఈ పవిత్రమైన మట్టి మనకు స్వేచ్ఛను ఇస్తోందన్నారు. స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. ముఖ్యంగా యువత అన్ని విషయాలూ తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దేశానికి సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, డీఆర్‌ఓ గాయత్రీదేవి, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ నాగమోహన్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, కార్పొరేటర్ లీలావతి పాల్గొన్నారు.

కలెక్టరేట్ సుందరీకరణకు నిధులు

కలెక్టరేట్ సుందరీకరణకు ఎంపీ ల్యాడ్స్ నిధులు కేటాయించామని ఎంపీ రంగయ్య తెలిపారు. ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి ఆదివారం కలెక్టరేట్ సుందరీకరణ పనుల శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పురాతనమైన కలెక్టరేట్ భవనాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కోరిక మేరకు భవనం సుందరీకరణకు అసవరమైన నిధులను ఎంపీ ల్యాడ్స్ కింద ఇచ్చామన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డివి శవ రాజకీయాలు

- సానుభూతి కోసం అన్న దివాకర్‌రెడ్డినీ చంపించగలడు
- టీడీపీ టికెట్ రాదని మతిభ్రమించింది
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫైర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం క్రైం: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తన కుమారుడు జేసీ అస్మిత్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో గెలిపించుకునేందుకు శవరాజకీయాలకు చేయడానికి కూడా వెనుకాడడని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. సానుభూతి కోసం అవసరమైతే తన అన్న జేసీ దివాకర్‌రెడ్డిని చంపించేందుకైనా సిద్ధపడతాడని ఆరోపించారు. ఆదివారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ నుంచి టికెట్ వచ్చే అవకాశం లేకపోవడంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి మానసిక ఒత్తిడికి లోనై చంద్రబాబు, లోకేష్ దృష్టిలో పడేందుకు పడరానిపాట్లు పడుతున్నాడన్నారు. తనకు వీలుకాని పక్షంలో తనయుడు అస్మిత్‌రెడ్డికైనా టీడీపీ టికెట్ తెచ్చుకోవాలని నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. గతంలో ఇటువంటి దిగుజారుడు రాజకీయాలకు పాల్పడి జేసీ దివాకర్‌రెడ్డి మంత్రి పదవి కోల్పోయాడని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రభాకర్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడన్నారు. 'నాడు-నేడు' కార్యక్రమం కింద జూనియర్ కళాశాలకు ప్రహరీ ఏర్పాటు చేస్తుంటే కార్మికులు, నగరపాలక సంస్థ అధికారులను బెదిరించడం, 60 అడుగుల రోడ్డు ఉందంటూ, గతంలో 120 అడుగుల రోడ్డు ఉండేదని చెబుతూ అభివృద్ధిని అడ్డుకుంటున్నాడన్నారు. తాము, అధికారులు అక్కడికి వస్తామని, జేసీ ప్రభాకర్‌రెడ్డి కూడా వస్తే 120 అడుగులు రోడ్డు కొలతలు వేసి ఆక్రమణలను తొలగిద్దామని, ఇందుకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు కోర్టుకు

తాడిపత్రిలో ఆస్పత్రి, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నిర్మాణాలపై కోర్టుకెళ్లడం, 750 మంది పేదలకు మాన్యంలో పట్టాలిస్తుంటే దానికీ అభ్యంతరం తెలపడం, ఇలా ప్రతి అభివృద్ధి పనులనూ కోర్టుకెళ్లి అడ్డుకునేందుకు జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రయత్నిస్తుండడంపై పెద్దారెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను తానెన్ని కాపాడానో, వారి 30 ఏళ్ల పాలనలో ఎన్ని కాపాడారో, అలాగే గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. మునిసిపల్ ఎన్నికలు జరిగే సమయంలో తమ కార్యకర్తలు, నాయకులను విమర్శించాడని, దీంతో వాళ్లు ఆగ్రహంతో జేసీ ఇంటికి వెళ్లారని, నా పాద స్పర్శతో మునిసిపల్ ఎన్నికల్లో నెగ్గి చైర్మన్ అయ్యాడన్నారు. ఇప్పుడు కూడా తనతో దెబ్బలు తిని ఎమ్మెల్యే కావాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అయితే అతనిపై దాడి చేసే సంస్కృతి తనది కాదన్నారు.

అధికారుల ప్రేక్షకపాత్రపై ఆగ్రహం


గతంలో కలెక్టర్ నాగలక్ష్మిపై జేసీ ప్రభాకర్‌రెడ్డి నోరు పారేసుకోవడంతో పాటు గన్‌మెన్‌లను తోసినా ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని, పోలీసులు, అధికారులను దుర్భాషలాడుతున్నా ప్రేక్షకపాత్ర పోషించడంతోనే రెచ్చిపోతున్నాడని పెద్దారెడ్డి అన్నారు. 'నాడు - నేడు' పనులను అడ్డుకుని, అక్కడ సామగ్రి ఎత్తుకెళ్లిన విషయంపై కేసు పెట్టినా అధికారులు స్పందించకుండా అతనితోనే రాయబారాలు నెరుపుతున్నారన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడని కొలతలు వేయడానికి అధికారులు వెళ్లడమేంటని ప్రశ్నించారు. జేసీ అనుచరులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించారని, దానిపై విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభాకర్‌రెడ్డి తన ఇంట్లో ఉన్న అక్కను చంపేందుకు యత్నిస్తున్నాడని, రానున్న ఎన్నికల్లోనూ జేసీ దివాకర్‌రెడ్డికి ఇంజెక్షనో, మాత్రో ఇచ్చి హత్య చేయించి సానుభూతితో కుమారుడు అస్మిత్ రెడ్డిని ఎన్నికల్లో గెలిపించుకోవాలని చూస్తున్నాడని ఆరోపించారు. ఎన్నికల తర్వాత జేసీ ప్రభాకర్‌రెడ్డి మూటాముల్లె సర్దుకుని హైదరాబాద్‌కు మకాం మారుస్తాడన్నారు.


బతికుండగానే చంపేశారు!

- ఓటమి భయంతోనే ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కుట్రలు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపే లక్ష్యం

ప్రజా సమస్యలు పట్టని తెలుగుదేశం పార్టీ ఉనికి కోల్పోయింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో 'ఓటమి భయం' ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకును దెబ్బతీసేందుకు కుట్రలకు తెర లేపుతున్నారు. సానుభూతిపరులను గుర్తించి, వారిని ఓటరుజాబితా నుంచి తప్పించేందుకు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఏకంగా బతికున్న వారిని చనిపోయారని పేర్కొంటూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించడం కలకలం రేపుతోంది.

- ఉరవకొండ పట్టణం శివరామిరెడ్డి కాలనీలో నివాసముంటున్న కొల్లం నాగమ్మకు అంబేద్కర్‌నగర్ 118 పోలింగ్ బూత్ పరిధిలో (బీఎక్స్‌డబ్ల్యూ 2241370) లో ఓటు ఉంది. అయితే ఈమె చనిపోయిందని ఓటరు జాబితా నుంచి తొలగించాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.
- ఉరవకొండ పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన మరియమ్మకు (టీబీఓ 1631340) ఓటు హక్కు ఉంది. ఈమె కూడా చనిపోయిందని, జాబితా నుంచి పేరు తొలగించాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.
- కూడేరులో హరీష్‌బాబు తుప్పటి (టీబీ009373 02)కి ఓటు ఉంది. ఈయన వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు అశ్వని భర్త. విచిత్రమేమిటంటే హరీష్‌బాబు చనిపోయాడని, ఈయన పేరు ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఎమ్మెల్యే ఫిర్యాదు చేయించారు.


531 BXW2241370
పేరు : నాగమ్మ
భర్త పేరు : పురుషోత్తం
ఇంటి నెంబరు : 9-3-289-C1
వయస్సు : 67 లింగము : స్త్రీ


355 TBO1631340
పేరు : మరియమ్మ
తండ్రి పేరు : ఆనందయ్య
ఇంటి నెంబరు : 9-3-288-2C
వయస్సు : 64 లింగము : పు

ఓటరు జాబితాలో కొల్లం నాగమ్మ, మరియమ్మ పేరు ఉన్న దృశ్యం

ఉరవకొండ: ఓట్లు వేయించుకుని ఎమ్మెల్యేగా గెలిచిన పయ్యావుల కేశవ్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండాపోయారు. ఏనాడూ ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను అడిగిన పాపాన పోలేదు. హైదరాబాద్, విజయవాడ కేంద్రాలకు పరిమితమైపోయారు. గడిచిన నాలుగేళ్లలో టీవీ చానళ్లు, పత్రికలలో మాత్రమే ఆయన కనిపించారు. నియోజకవర్గంలోకి ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో కూడా తెలియక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తమ బాగోగులు పట్టని ప్రజాప్రతినిధికి ఈసారి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు సైతం ప్రజలను పలకరించిన దాఖలాలు లేవు. పరిస్థితిని ముందే గ్రహించిన పయ్యావుల కేశవ్ తమకు ఓటు వేయరనుకున్న వారితో పాటు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించాలని భావించారు. కొద్ది రోజుల క్రితం నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు చేత ఎమ్మెల్యే కేశవ్ ఎన్నికల కమిషన్‌కు ఉరవకొండ నియోజకవర్గంలో బతికున్న ఓటర్లను చనిపోయారని వీరిని జాబితా నుంచి తొలగించాలని ఫిర్యాదు చేయించారు. కేశవ్‌తో లాలూచి పడి ఎంపీ ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై నియోజకవర్గ ప్రజలు, ఓటర్లు మండిపడుతున్నారు. అసలు ఉరవకొండ నియోజకవర్గ ఓటర్ల గురించి ఎంపీ రఘురామకృష్ణరాజుకు ఏం సంబంధం అని ప్రశ్నిస్తున్నారు.

మానవత్వం ఉందా?



నేను కొన్నేళ్లుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నా. నేను చనిపోయానంటూ ఫిర్యాదు చేశారని తెలిసింది. అయ్యా మీకు మానవత్వం ఉందా.. బతికుండగానే చంపేస్తారా..? టీడీపీ వారు ఇలాంటి రాజకీయాలు చేయడం మంచిది కాదు. – కర్రెప్ప, ఉరవకొండ

ఇంటింటి సర్వే 95.05 శాతం

- నేటితో ముగియనున్న గడువు

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ - 2024లో భాగంగా బీఎల్‌ఓలు చేపట్టిన ఇంటింటి సర్వే సోమవారంతో ముగియనుంది. ఆదివారం నాటికి జిల్లావ్యాప్తంగా 95.03 శాతం సర్వే జరిగింది. మిగిలిన 4.07 శాతం సోమవారం పూర్తవుతుందని అధికారులు తెలిపారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి తిరుమలరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు దివాకర్‌రావు, ఎస్‌ఏ యోగి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు 129 (రహమత్‌నగర్), 143 (అరవిందనగర్) పరిధిలో సర్వేని కమిషనర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు 234, 242, 246 (జీఎస్టీ భవన్, పాతూరు) పరిధిలో జరుగుతున్న సర్వేని పరిపాలనాధికారి పరిశీలించారు. ఎన్నికల డీటీ పోలింగ్ కేంద్రాలు 120, 122 (రహమత్‌నగర్), 103, 106 (రాంనగర్), ఎలక్షన్ ఎస్‌ఏ పోలింగ్ కేంద్రాలు 205, 208, 210 (రాణీనగర్) పరిధిలో సర్వేని పరిశీలించారు.

క్లుప్తంగా

మయూర వాహనంపై వీరభద్రుడు



విడపనకల్లు: ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మయూర వాహనంపై కాళికాదేవి సమేతంగా వీరభద్రుడు భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. కార్యక్రమాలను ఆలయ ఈఓ రమేష్‌బాబు, చైర్మన్ బసవరాజు, బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రుద్రప్ప పర్యవేక్షించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య



ఆనంద్ మృతిపై విచారిస్తున్న గుత్తి సీఐ వెంకట్రామిరెడ్డి

నార్పల/గుత్తి రూరల్: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు..

- నార్పలలోని సీపీఐ కాలనీకి చెందిన ఎరికల వెంకట లక్ష్మయ్య భార్య లక్ష్మీదేవి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి అంటే కుమారుడు గిరి (20)కి అమితమైన ప్రేమ. దీంతో తల్లి మృతితో తీవ్ర మనోవేదనకు లోనైన గిరి ఎలాగైనా ఆమెను కలవాలని కలవరించేవాడుఏ. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.
- మరో ఘటనలో గుత్తి మండలం జక్కలచెరువు గ్రామానికి చెందిన చాకలి రామాంజనేయులు, రాధమ్మ దంపతుల కుమారుడు ఆనంద్(22) ఆత్మహత్య చేసుకున్నాడు. రజక వృత్తితో పాటు బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. కొన్ని రోజులుగా ముభావంగా ఉండే ఆనంద్ ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. అనంతరం పెద్దవడుగూరు మండలం జి.వెంకటాపల్లికి వెళ్లేదారి పక్కనే ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన అటుగా వెళుతున్న వారి నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకట్రామిరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆనంద్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

సెలవులో డీఆర్‌ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) గాయత్రీదేవి వ్యక్తిగత పనులపై సోమవారం నుంచి ఈ నెల 27 వరకు సెలవు పెట్టారు. ఈ నెల 28వ తేదీన ఆమె తిరిగి విధులకు హాజరవుతారు. డీఆర్‌ఓ బాధ్యతలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (పీఏబీఆర్‌- ఎల్‌ఏ) శ్రీనివాసులుకు అప్పగించారు.

ప్రైవేట్‌ను వదిలి... ప్రభుత్వ బడికి

- ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్న విద్యార్థులు
- తమ పిల్లల్ని స్వచ్ఛందంగా చేర్పిస్తున్న తల్లిదండ్రులు
- మన ఊరు-మన బడితో సౌకర్యాలు ఫుల్
- ఆకర్షిస్తున్న ఇంగ్లిష్ మీడియం చదువులు





ఆసక్తిగా వింటున్న విద్యార్థులు, అర్థమయ్యే రీతిలో సైన్సు బొమ్మగీసి వివరిస్తున్న ఉపాధ్యాయురాలు

కళ్యాణదుర్గం: కార్పొరేట్‌ను తలదన్నే సౌకర్యాలు.. నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం చదువులు.. ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్స్ కూడా ఇస్తుండడంతో సర్కార్ బడులకు డిమాండ్ పెరిగింది. విద్యార్థులు ప్రైవేట్‌ను వదిలి.. ప్రభుత్వ పాఠశాలలవైపు కదిలారు. ఈ నేపథ్యంలో కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు పుంజుకున్నాయి. ఇంత కాలం సామాన్యులు, పేదల పిల్లలే చదువుకుంటున్న ప్రభుత్వ బడిలోకి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సైతం వారి పిల్లలను చేరుస్తున్నారు.

కిక్కిరిసిన కేసీజీహెచ్

కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కేసీజీహెచ్) గతంలో ఎన్నడూ లేనంతగా విద్యార్థులతో కిక్కిరిసింది. ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించారు. 1955లో పాఠశాల స్థాపించినప్పుడు కేవలం కొద్ది మందితోనే పాఠశాల నడిచింది. ఆ తర్వాత పాఠశాలలో విలువలతో కూడిన విద్య అందిస్తుండటంతో బడికి వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యను అప్పటి సీఎం చంద్రబాబు నీరుగారుస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు అప్పట్లో అడుగంటాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ విద్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనివ్వడంతో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం సంతరించుకుంది. దీనికి తోడు మనబడి

ఈ ఏడాది అడ్మిషన్ ఇలా...

తరగతి	విద్యార్థుల సంఖ్య
6వ	237
7వ	271
8వ	280
9వ	366
10వ	350
మొత్తం	1,504

నాడు-నేడు కార్యక్రమాలతో పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా మార్చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు పలువురు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కేసీజీహెచ్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య 1,504కు చేరుకుంది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)లతో విద్యాబోధనను అందుబాటులోకి తీసుకురావడంతో కేసీజీహెచ్‌లోని 23 తరగతి గదులకు 23 ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేశారు. వీటి ఒక్కొక్క దాని విలువ రూ.1.50 లక్షలని ఉపాధ్యాయులు తెలిపారు.

రూ.1.29 కోట్లతో అభివృద్ధి



మనబడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఇప్పటికే రూ.1.29 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు సమకూర్చాల్సిన అవసరం ఉంది. 10 మంది ఉపాధ్యాయులు కూడా అవసరం. దాతల సాయంతో ప్యూరిఫైర్ డ్రింకింగ్ వాటర్ వసతి కల్పించాం. డైనింగ్ హాల్ ఏర్పాటు చేయగలిగితే విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

– గంధం శ్రీనివాసులు, హెడ్‌మాస్టర్, కేసీజీహెచ్, కళ్యాణదుర్గం

జగతికి ఆదర్శప్రాయుడు వాల్మీకి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: యావత్ జగతికి వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని, ప్రతి ఒక్కరూ మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మతో కలసి ఆదివారం రాప్తాడులో ఆదివారం జరిగిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విశేష పూజలు నిర్వహించి, విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని చాటి చెప్పిన వాల్మీకి జీవితం ఎంతో గొప్పదన్నారు. రామాయణం వంటి సుందరమైన కావ్యాన్ని రచించి జగతికి ఆదర్శ ప్రాయుడయ్యారన్నారు. అంతకు ముందు గ్రామంలో జ్యోతుల ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యువతులు, మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వాల్మీకి మహర్షి విగ్రహం వద్దకు చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాలరెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ నాయకులు కాంట్రాక్టర్ రాముడు, సాకే చంద్ర, కేశవయ్య, వెంకటరాముడు, జయన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కవిత్వానికి గీటురాయి కొత్తపల్లి

- పురస్కార ప్రదానోత్సవ సభలో వక్తలు

అనంతపురం: ఉత్తమ కవిత్వానికి గీటురాయిగా కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం నిలుస్తోందని డాక్టర్ శాంతి నారాయణ అన్నారు. ఆదివారం అనంతపురంలోని సెంట్రల్ లైబ్రరీలో జరిగిన పురస్కార ప్రదానోత్సవం సభకు ఆయన అధ్యక్షత వహించారు. కొత్తపల్లి నరేంద్రబాబు పేరుతో ఏటా ఇస్తున్న సాహిత్య పురస్కారానికి గాను 2022కి చీరాలకు చెందిన రచయిత, కవి పి.శ్రీనివాసగౌడ్ రచించిన 'చిన్ని చిన్ని సంగతులు' కవితా సంపుటి ఎంపికైంది. 2023 సంవత్సర పురస్కారానికి గూండ్ల వెంకటనారాయణ రచించిన 'ఇయ్యాల ఊళ్లో' సంపుటి ఎంపికైంది. ఒకే వేదికపై వీరిద్దరికీ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణ స్వామి మాట్లాడుతూ.. నన్నేచోడుడు నుంచి నేటి దాకా తెలుగు సాహిత్యంలో వచ్చిన మలుపుల్ని, ఆ మలుపుల్లో నుంచి పుట్టుకువచ్చిన కవితా ఉద్యమాలను గుర్తు చేశారు. డాక్టర్ శాంతి నారాయణ మాట్లాడుతూ.. రాయలసీమ కవిత్వం ఔనత్యాన్ని కొనియాడారు. విశిష్ట అతిథిగా హాజరైన వెంకటకృష్ణ, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ.. నరేంద్రబాబు రాసిన కవిత్వాలను ఓ పుస్తకంగా తీసుకురావాల్సిన బాధ్యత, అవసరం ఎంతైనా ఉందన్నారు. అబ్దుల్ కలామ్ ఆజాద్ హిందీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ జి.రత్నాకర్, నిర్వాహకులు కొత్తపల్లి సురేష్, శశికళ, తూముచెర్ల రాజారాం, రామకృష్ణ, డాక్టర్ అంకే శ్రీనివాస్, సిద్ధగిరి శ్రీనివాసులు, గుడిపల్లి విద్యావతి, అశోక్ కుమార్, పోతుల రాధాకృష్ణ, వన్నప్ప, జెన్నే ఆనంద్‌కుమార్, నబీరసూల్, ఈరన్న, మురళీకృష్ణ, చెగువెర హరి, వలస రమేష్, చిలకూరు దీవెన, ప్రగతి, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



సాహితీ పురస్కారానికి ఎంపికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం

80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేయాలి

- అగ్రి అడ్వైజరీబోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి

వజ్రకరూరు: ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంబంధించి రైతులకు 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేయాలని కలెక్టర్ గౌతమిని కోరినట్లు జిల్లా అగ్రిఅడ్వైజరీబోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం కమలపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశంలో అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. పగటి పూటే వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని, రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించాలని సూచించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆర్బీకే వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలోనే రైతులకు వ్యవసాయ సేవలు అందిస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

దోమకాటు వ్యాధులకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: మలేరియా, డెంగీ తదితర దోమకాటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ సూచించారు. ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి ఓబుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్ రొనాల్డ్ రోస్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. సర్ రోనాల్డ్ రోస్ గొప్పతనాన్ని వివరించారు. దోమకాటు వల్ల మలేరియా జ్వరం వస్తుందని 1897, ఆగస్టు 20న ఆయన కనుగొన్నారన్నారు. ఈ పరిశోధనకు గాను 1902లో వైద్య శాస్త్రంలో ఆయనకు నోబెల్ బహుమతి వచ్చిందన్నారు. దోమకాటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఎంఓ ఓబులు వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమ జేమ్స్, సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, విస్తరణ అధికారి గిరిధర్ రెడ్డి, ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సర్ రొనాల్డ్ రోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ యుగంధర్

సౌత్ జోన్‌కు ముగ్గురి ఎంపిక



బి.అనూష



అర్షియా



భావనారెడ్డి

అనంతపురం: ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకూ మంగళగిరిలో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సీనియర్ ఉమెన్ అంతర్ జోన్ మ్యాచ్‌లకు సౌత్ జోన్ జట్టులో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు దక్కింది. వీరిలో భారత మహిళా క్రికెట్ జట్టు సభ్యురాలు బి.అనూష, కదిరికి చెందిన ఎస్.అర్షియా, కె.భావనారెడ్డి ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు సుబ్బయ్య

నార్పల: కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నార్పలకు చెందిన కుమ్మర సుబ్బయ్య (53) కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం నార్పల సమీపంలోని పొలాల్లో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఆర్టీటీ కార్యాలయ సమీపంలోకి చేరుకోగానే నాయనపల్లి క్రాస్ నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిన సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల మధ్య ఘర్షణ

- ఇంటి స్థలం విషయంగా వివాదం
- పని ప్రాంతంలో పరస్పర దాడులు
- ముగ్గురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

గుత్తి: గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడులు చేసుకున్నారు. వివరాలు.. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో నివాసముంటున్న మురళీకృష్ణ, జనార్దన్‌రాజు, శ్రీనివాసులు డీజిల్‌షెడ్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్నారు. వీరిలో జనార్దనరాజు, శ్రీనివాసులు అన్నదమ్ములు. వీరికి మురళీకృష్ణకు మధ్య ఇంటి స్థలం విషయంగా కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో వివాదానికి కేంద్రమైన స్థలంలో మురళీకృష్ణ వాకిలి పెట్టేందుకు ప్రయత్నించడంతో జనార్దనరాజు, శ్రీనివాసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఆదివారం ఉదయం డీజిల్ షెడ్‌లో విధులకు హాజరైన ముగ్గురూ వాదులాడుకుంటూ పరస్పరం దాడులకు తెగబడ్డారు. ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తోటి కార్మికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జనార్దనరాజును అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

డీజిల్ షెడ్ ఉద్యోగి దుర్మరణం

- రైలింజన్‌లో పనిచేస్తుండగా ఘటన
- ప్రెషర్ ఫ్యాన్‌లో చిక్కుకుని ముక్కలైన దేహం



శాంతిరామ్ (ఫైల్)

గుంతకల్లు: రైలింజన్‌లో మరమ్మతులు చేస్తూ ప్రమాదం బారిన పడి ఓ ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో నివాసముంటున్న శాంతిరామ్ (50)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డీజల్ షెడ్‌లో సీనియర్ టెక్నిషియన్‌గా పని చేస్తున్న శాంతిరామ్ ఆదివారం విధుల్లో భాగంగా రైలింజన్‌లోని ప్రెషర్ ఫ్యాన్‌కు రబ్బరు మార్చే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ విషయం తెలియని మరో ఉద్యోగి అనిల్ (బిహార్) రైలింజన్‌ను ఆన్ చేశాడు. దీంతో ప్రెషర్ ఫ్యాన్‌లో చిక్కుకుని శాంతిరామ్ దేహం ముక్కలు ముక్కలైంది. విషయం తెలుసుకున్న షెడ్ ఉద్యోగులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సమాచారం అందుకున్న డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ మంగాచార్యులు, ఇతర అధికారులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అనంతరం శాంతిరామ్ మృతదేహం అవశేషాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దుర్ఘటనపై గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

నిబంధనలు పాటించకపోవడం వల్లనేనా?

శాంతిరామ్ దుర్ఘటన వెనుక నిబంధనలు పాటించకపోవడమే కారణంగా తెలుస్తోంది. వాస్తవానికి రైలింజన్ కంప్రెషన్ రూమ్‌లో మరమ్మతులు చేస్తున్నప్పుడు కార్మికులు కొన్ని నిబంధనలు తప్పక పాటించాలి. రైలింజన్ మరమ్మతులు చేసే సమయంలో ఇంజన్ ఆన్ చేయకూడదంటూ ఓ బోర్డు పెట్టాలి. అనంతరం ఆన్ చేసే ముందు 'సంభాలో.. సంభాలో (జాగ్రత్త.. జాగ్రత్త)' అంటూ రైలింజన్ చుట్టూ తిరుగుతూ గట్టిగా కేకలు వేసి అప్రమత్తం చేసి, సైరన్ మోగించాలి. అయితే ఇద్దరూ టెక్నీషియన్లు ఈ నింబంధనలు పాటించారా లేదా అనే విషయమై అధికారులు విచారణ చేపట్టారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారుల సస్పెన్షన్

అనంతపురం సిటీ: ఉరవకొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన జెడ్పీ పూర్వపు సీఈఓ శోభాస్వరూపరాణి, ప్రస్తుత సీఈఓ భాస్కర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఆదివారం ఉత్తర్వులు అందాయి. ఉరవకొండ నియోజకవర్గంలో ఓట్ల గల్లంతు నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో గాయపడిన గంగాధర్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అనంతపురం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో నివాసం ఉంటున్న గంగాధర్ (27) సెంట్రింగ్ పనులతో జీవనం సాగించేవాడు. శనివారం సాయంత్రం పనులు ముగించుకుని పీకల దాకా మద్యం సేవించి పాతూరు సున్నం గేరిలో తిరుగుతూ ఆదివారం ఉదయాన్నే తలకు తీవ్రమైన గాయంతో అపస్మారక స్థితిలో కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గంగాధర్‌ను సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేకు కర్నూలులోని జీజీహెచ్‌కు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించిక అక్కడే ఆయన మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తులు తలపై దాడి చేయడంతోనే గంగాధర్ స్పృహ తప్పి పడిపోయినట్లుగా పోలీసులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రెచ్చిపోయిన 'ఈనాడు' రిపోర్టర్

- ఎస్ఎస్ఏ కార్యాలయ ఆవరణలో దౌర్జన్యంగా చెట్ల తొలగింపు
- జేసీబీతో స్థలాన్ని చదును చేసిన వైనం
- అడ్డుకోబోయిన ఉద్యోగులకు బెదిరింపులు



చెట్లను తొలగించి స్థలాన్ని చదును చేస్తున్న జేసీబీ

రాప్తాడు రూరల్: ఈనాడు పత్రికలో పని చేస్తున్న ఓ రిపోర్టర్ రెచ్చిపోయాడు. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో ఉన్న స్థలాన్ని కబ్జా చేసేందుకు పూనుకున్నాడు. అడ్డుకోబోయిన ఉద్యోగులను బెదిరించాడు. వివరాల్లోకి వెళ్తే... ఈనాడు పత్రికలో రిపోర్టర్‌గా పని చేసే చంద్రశేఖర్ ఆదివారం ఉదయం జేసీబీ వెంట పెట్టుకుని సమగ్ర శిక్ష కార్యాలయ ఆవరణలోకి దూసుకెళ్లాడు. ఆవరణలో ఉన్న కొన్ని చెట్లను తొలిగించి ఆ ప్రాంతాన్ని చదును చేయించాడు. సెలవు రోజు కావడంతో ఉద్యోగులెవరూ అక్కడ లేరు. విధుల్లో ఉన్న వాచ్‌మన్ శంకర్‌నాయక్ అడ్డుకునే ప్రయత్నం చేయగా దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఇదే విషయాన్ని సూపరింటెండెంట్ సునీల్‌కు వాచ్‌మెన చేరవేయడంతో వెంటనే ఆయనతో పాటు అసిస్టెంట్ సీఎంఓ గోపాలకృష్ణ, ఎంఈఓ గురుప్రసాద్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో వారితోనూ చంద్రశేఖర్ తీవ్ర స్థాయిలో వాదనకు దిగాడు. 'ఏయ్...నేనంటే ఏమనుకున్నారు... నాపేరు చంద్రశేఖర్. 20 ఏళ్లుగా ఈనాడులో రిపోర్టర్‌గా పని చేస్తున్నా. మీరు ఇక్కడ ఈ రోజు ఉంటారు రేపు పోతారు. మీరు అనవసరంగా జోక్యం చేసుకోవద్దు' అంటూ హెచ్చరించాడు. ఇది ప్రభుత్వ కార్యాలయమని ఏదైనా ఉంటే డీపీసీ, ఏసీపీతో మాట్లాడాలని సూపరింటెండెంట్ చెప్పినా వినకుండా ఎవరెవరికో ఫోన్లు చేసి గట్టిగా రెచ్చిపోయాడు. ఉద్యోగులు కూడా తీవ్రస్థాయిలో ప్రతిఘటించడంతో చివరకు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై సూపరింటెండెంట్ సునీల్ 'సాక్షి'తో మాట్లాడుతూ... ఈనాడు రిపోర్టర్ చంద్రశేఖర్ దౌర్జన్యంగా వచ్చి కార్యాలయ ఆవరణలోని చెట్లను తొలగించాడన్నారు. తాను అడ్డుకోబోతే బెదిరించాడన్నారు. ప్రభుత్వ కార్యాలయంలోని చెట్లను అక్రమంగా తొలిగించి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించడంపై సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఏపీఎస్ఏపీఈఏ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక

రాప్తాడు రూరల్: ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఏపీఎస్ఏపీఈఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం అనంతపురంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు సమావేశమై వివిధ సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కె. శ్రీనివాసులు, కోశాధికారిగా సునీత ఎన్నికయ్యారు. వీరికి అసోసియేషన్ పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహారెడ్డి, రాజశేఖర్, ప్రభాకర్, లక్ష్మీ నారాయణ అభినందనలు తెలిపారు.

వివాహిత మిస్సింగ్ కేసు ఛేదింపు

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన వివాహిత మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. గత శుక్రవారం తన ఇద్దరు పిల్లలతో కలసి శైలజాదేవి అదృశ్యమైన విషయం తెలిసిందే. భర్త రవితో గొడవపడిన ఆమె గురువారం ఉదయం పిల్లలను తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆ తర్వాత ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కియా పోలీసులకు ఆమె తండ్రి శ్రీరాములు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో మిస్సింగ్ కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చిన్నారులతో కలసి తచ్చాడుతున్న శైలజాదేవిని పోలీసులు గుర్తించి, ఆదివారం పెనుకొండ పోలీస్ స్టేషన్‌కు పిలుచుకువచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి, అప్పగించారు.

క్లుప్తంగా

నేడు మాధవరాజుల విగ్రహ ప్రతిష్ట


సనప గ్రామంలో నూతన విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరు: సనప గ్రామంలోని మాధవ రాజుల స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్టతో పాటు పలు పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయంలో యంత్రాభిషేకాలు, అనుష్టానాలు, విగ్రహాలకు పంచామృత, సుగంధ ద్రవ్య ఔషధీ స్నపనములు క్షీరాధివాహనం తదితర పూజలు చేశారు. అనంతరం సాయంత్రం సనప గ్రామంలోస్వామి వారి నూతన విగ్రహాన్ని ఊరేగించారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి


చిత్రా శివయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి సర్పంచ్ గురుప్రసాద్ తండ్రి, మాజీ సర్పంచ్ చిత్రా శివయ్య మృతదేహానికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాళి అర్పించారు. అనారోగ్యానికి గురైన చిత్రా శివయ్య బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆదివారం ఆకుతోటపల్లిలోని నివాసానికి చేరుకొని శివయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట ఎంపీపీ వరలక్ష్మీ, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్తరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు కక్కలపల్లి కృష్ణయ్య పూలకుంట కృష్ణారెడ్డి, ఇటుకలపల్లి భాస్కర్‌రెడ్డి, నాయకులు పసుపుల ఆది, కాటిగానికాలవ ఆదిరెడ్డి, కందుకూరు రాగే పెద్దప్ప తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ తిప్పేనాయక్

చెన్నేకొత్తపల్లి: ఓటరు జాబితాల పరిశీలన పారదర్శకంగా జరుగుతోందని ధర్మవరం ఆర్‌డీఓ తిప్పేనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని పులేటిపల్లి, చెన్నేకొత్తపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఓటరు జాబితా పరిశీలనను ఆయన తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు చేస్తున్న సర్వేను ఆయన ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. ప్రతి ఇల్లూ తిరిగి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్లు ఉన్నరా, వేరే ప్రాంతానికి మారారా, ఎవరైనా చనిపోయారా, కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునే వయస్సు వారు ఉన్నారా? తదితర వివరాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, బీఎల్‌ఓలు మహేష్‌రెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న పోతలయ్యస్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామివారికి బోనాలు సమర్పించారు. తర్వాతా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పోతలయ్య, చెన్నేకేశవస్వాములను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నాగుల చవితి సందర్భంగా ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలా గ్రామ శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు


నాగుల చవితికి తయారు చేసిన నైవేద్యం


చెరువుకట్ట వద్ద పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు


పుట్టకు పాలు పోస్తున్న మహిళలు


పూజలు చేస్తున్న భక్తులు

శ్రావణమాసంలో వచ్చిన తొలి పర్వదినం నాగుల చవితి వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. పలు ఆలయాల్లో నాగుల కట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా పాతూరు, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రాంగణం, కోవూరునగర్, పీటీసీ తదితర చోట్ల పుట్టల వద్ద భక్తులు బారులుతీరి పుట్టకు పాలుపోసి, పండ్లు ప్రసాదంగా పెట్టారు. స్వామివారి భక్తి గీతాలతో సుబ్రహ్మణ్యేశ్వరుడికి భక్త నీరాజనాలర్పించారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ సోమవారం గరుడ పంచమి వేడుకలు జరుగుతాయన్నారు.

– అనంతపురం కల్చరల్:



చెరువుకట్టవద్ద పుట్టకు పాలు పోసి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

నేత్రపర్వం.. నాగిని కళా ఉత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలో నాగిని కళా ఉత్సవాల నగరోత్సవం నేత్రపర్వంగా జరిగింది. కరణం నాగిని వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది కళాకారుల కళా విన్యాసాల నడుమ నాగేంద్రుడు అడుగడుగునా భక్తి నీరాజనాలు అందుకున్నాడు. స్థానిక మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వర ఆలయం ప్రాంగణంలో ఉత్సవ వేడుకలను ఆలయ ఈవో రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, నిర్వాహకులు కరణం వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఆద్యంతం నగర వీధుల్లో కోలాటం,గురవయ్యలు, కీలుబొమ్మల కళాకారులు, చెక్క భజన తదితర కళారూపాలు కోలాహలంగా నిర్వహించారు. నాగుల విశిష్టతను వివరిస్తూ భక్తి గీతాలతో కళాకారులు నగర వీధులను మార్మోగించారు. మొదటి రోడ్డు నుంచి రామచంద్రానగర్, రెండు,మూడోరోడ్డు మీదుగా వివిధ ప్రాంతాల్లో సందడిగా సాగింది. వందలాది మంది భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


అలంకరణలో ఉత్సవమూర్తులు


అలంకరణలో నాగుల విగ్రహాలు


నగరోత్సవంలో కీలుగుర్రాలతో సందడి


గొరవయ్యల నృత్యం


నృత్యం చేస్తున్న లంబాడి మహిళలు

కళాకారులు ప్రజాపక్షం వహించాలి

- జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


ఎర్ర సితార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కవులు

అనంతపురం సిటీ: కళాకారులైనా, కళలయినా ప్రజాపక్షం ఉండాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఆదివారం అనంతపురం జెడ్పీ సమావేశ భవన్‌లో మహాబోధి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ సాంస్కృతిక స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆదినారాయణ 50 ఏళ్ల ప్రజా జీవితాన్ని ప్రతిబింబించేలా అనంత 'ఎర్రసితార' పుస్తకాన్ని అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి మహాబోధి సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం అధ్యక్షత వహించగా, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర నాటక అకాడమి చైర్‌పర్సన్ ప్రమీలమ్మ, జాషువా స్మారక కళాపరిషత్ చైర్మన్ పెద్దిటి యోహాను, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ఏలూరు యంగన్న, దాసన్నగారి కృష్ణమూర్తి అతిథులుగా హాజరయ్యారు. బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ఆదినారాయణ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ప్రస్తుతం ప్రసార మాధ్యమాలతో మన సంస్కృతి కలుషితమై పోతోందని ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నానాటికీ ఆదరణ కోల్పోతున్న ప్రజాకళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జనప్రియ కవి ఏలూరు యంగన్న మాట్లాడుతూ తాను రాసిన ఎన్నో పాటలు ఆదినారాయణ గళం ద్వారా తెలుగు రాష్ట్రాల నలుమూలలా మార్మోగాయన్నారు. ముఖ్యంగా తాన రాసిన 'ఎర్రసితార' పాట ఆదినారాయణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందని అభినందించారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతులమీదుగా ఆదినారాయణ, అరుణమ్మ దంపతులను సన్మానించారు. నూతన నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా సీహెచ ప్రమీళమ్మను ప్రత్యేకంగా సత్కరించారు. మహాబోధి అధ్యక్షులు దాసన్నగారి కష్ణమూర్తి, తోట నాగరాజు, షేక్ రియాజుద్దీన్, హెచ్.నాగలింగయ్య, డా.ఎ.ఎ.నాగేంద్ర, పూజారి ఈరన్న, గోవిందరాజులు, తరిమెల అమరనాథరెడ్డి, ఎస్‌యం బాషా, జయశ్రీ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఖాన్‌సాబ్ మరణం తీరనిలోటు


మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం టవర్ క్లాక్: సీనియర్ జర్నలిస్టు ఉర్దూ సియాసత్ దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ ' జహీరుద్దీన్ అలీ ఖాన్ మరణం సమాజానికి తీరని లోటని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ ప్రజాసంఘాల ప్రతినిధులు అన్నారు. ఆదివారం అనంతపురం ప్రెస్ క్లబ్‌లో మైనార్టీ డెవలప్‌మెంట్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖాన్ సాబ్‌కు నివాళులర్పించారు. తొలుత ముస్లిం మత పెద్దలు ఖురాన్ పఠణంతో ప్రత్యేక దువా చేశారు. రాజకీయాలకతీతంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సామాజిక న్యాయవేదిక కన్వీనర్ ప్రముఖ న్యాయవాది అబ్దుల్ రసూల్ హాజరయ్యారు. అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం ప్రజా గాయకుడు గద్దర్ అంతిమయాత్రలో పాల్గొన్న జహీరుద్దీన్ అలీ ఖాన్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. సమాజంలో వెనుకబాటుతనంతో మగ్గుతున్న ఎస్సీ, ఎస్టీ , బీసీ , మైనార్టీ ప్రజల సంక్షేమం , అభివృద్ధి కోసం అనేక విధాలుగా తన వంతు సేవలు అందించారన్నారు. ప్రజాస్వామిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు.అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జాఫర్ మాట్లాడారు. కార్యక్రమంలో మైనార్టీ డెవలప్‌మెంట్ ఫోరం ఉభయ జిల్లాల కన్వీనర్ వై. ఫకృద్దీన్, ఎండీఎఫ్ నాయకులు తాజ్, అన్వర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, ఫిరోజ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దర్శన్ కోసం ప్రత్యేక బస్సులు

గుంతకల్లుటౌన్: శ్రావణమాసం మంగళ, శనివారాల్లో కసాపురం, నేమకల్లు, మురడీ ఆంజనేయ స్వామి ఆలయాల సందర్శన కోసం గుంతకల్లు ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డీఎం నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హనుమాన్ దర్శనానికి వెళ్లే పెద్దలకు రూ.430, పిల్లలకు రూ.230 చొప్పున వసూలు చేస్తామని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శుభకార్యం


వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన మాజీ జెడ్పీటీసీ బందూక మధు కుమారుడు బందూక చరణ్, శివసాయి మౌనిక వివాహ వేడుకలకు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వివాహానికి ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మంగమ్మ, వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, మాజీ మంత్రి శైలజానాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, సీనియర్ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, ధనుంజయ యాదవ్ , ఎర్రిస్వామి రెడ్డి, మహానందరెడ్డి, కనుముక్కుల ఉమాదేవి, ఉరవకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్ష

అనంతపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సివిల్ సరీ్వసెస్, గ్రూప్–1, గ్రూప్–2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ రావు తెలిపారు. జిల్లాలో ఆర్ట్స్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల, కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. పరీక్షకు 1,676 మంది దరఖాస్తు చేసుకోగా, 1,055 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. మిగిలిన 612 మంది గైర్హాజరయ్యారని జేడీ తెలిపారు. బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి అన్నదొరై, అనంతపురం సంక్షేమ సహాయ అధికారి దామోదర్ రెడ్డి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

సంతల ఆదాయం రూ.3.37 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.37 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్, సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,46,460 వసూలు కాగా, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,57,260 మేర వసూలైందని తెలిపారు.

మానవత సంస్థ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న మానవత సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం కల్చరల్: నగరంలో కృష్ణకళా మందిరంలో మానవత స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముందుగా నూతన కమిటీ సభ్యులను వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రకటించారు. చైర్మన్‌గా రఘునాథ్ (విశ్రాంత డీఆర్వో), కేంద్ర కమిటీ సభ్యులుగా రాటాల గోపి, గౌరవ సలహాదారులుగా పెద్దన్నగౌడ్, విజయరాఘవన్, ప్రభాకర్, వరదరాజులు, అధ్యక్షుడిగా శీలా జయరామప్ప, ఉపాధ్యక్షుడిగా శ్రీనాథ్‌రెడ్డి, కార్యదర్శిగా గంగిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా నాగేశ్వరి తదితరులను ఎన్నుకున్నారు. ప్రముఖులు మాట్లాడుతూ మానవతా సంస్థ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. అంబులెన్స్, శాంతిరథం, ఫ్రీజర్ బాక్స్ తదితర కార్యక్రమాలను ఉచితంగా అందిస్తామన్నారు. విద్యా,వైద్యం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

కూడేరు: గొటుకూరు–ఎన్‌సీసీ నగర్ మధ్యన అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై శనివారం అర్థరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఉరవకొండలో ఓ వ్యక్తి పురుగులు మందు తాగడంతో అతని ఓ ప్రైవేటు అంబులెన్స్ కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళుతుండగా ఘటనా స్థలికి రాగానే ముందు వెళుతున్న ట్రాక్టర్‌ని అంబులెన్స్ అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్ ముందు భాగం బాగా దెబ్బతింది. అందులో ఉన్న రాజేశ్వరి, చిదానంద గాయపడ్డారు. క్షతగాత్రులను మరో వాహనంలో అనంతపురం తీసుకెళ్లారు.

దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

కూడేరు: అరవకూరులో ఆదివారం పొలం గట్టు విషయమై మలోబులు(కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు), అతని దాయాదులైన మలరాయుడు, అతని కుమారుడు వేణు ఆదివారం పొలంలో ఘర్షణ పడ్డారు. ఘటనలో మలోబులుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మలోబులు అనంతపురంలోని సర్వజన ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అశోక్ రెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు అంజిబాబు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

నగరంలో తెగబడ్డ స్నాచర్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో స్నాచర్లు తెగబడ్డారు. నిమిషాల వ్యవధిలో రెండు ప్రాంతాల్లో స్నాచర్లు చేతివాటాన్ని ప్రదర్శించారు. మొత్తంగా 10 తులాలు బంగారు గొలుసులను లాక్కెళ్లారు. ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఇద్దరు స్నాచర్లు సాయంత్రం రాత్రి 8 గంటలకు రాంనగర్‌లోని రిజిష్టర్ కార్యాలయం వద్ద ముచ్చుకోట నాగరత్నమ్మ అనే మహిళ అంగట్లో ఉండగా ఆమెతో మాటలు కలిపి, మెడలోని ఏడు తులాల రెండు బంగారు గొలుసులు లాక్కొని, పల్సర్ వాహనంపై ఉడాయించారు. జనం చూస్తుండగానే స్నాచింగ్ చేయడాన్ని చూసి స్థానికులు గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. రాంనగర్ నుంచి రుద్రంపేట వైపుగా వచ్చిన స్నాచర్లు.. పాలప్యాకెట్ తీసుకెళ్తున్న సుజాత అనే మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధిత మహిళల కుటుంబాల సభ్యులు అనంతపురం నాల్గో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

13 నుంచి బీబీ జైనబ్బీ ఉరుసు


ఉరుసు పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: సెప్టెంబర్ 13 నుంచి ప్రసిద్ధిగాంచిన హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో బీబీ జైనబ్బీ దర్గా కమిటీ సభ్యులు, పార్టీ మైనార్టీ ముఖ్యనేతల సమక్షంలో ఉరుసు పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, యువజన విభాగం జోనల్ చైర్మెన్ వై.ప్రణయ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా మాట్లాడుతూ జైనబ్బీ అమ్మవారి ఉరుసు సెప్టంబర్ 13 నుంచి ప్రారంభమవుతుందన్నారు. 13న గంధం, 14న ఉరుసు, 15న జియారత్ వేడుకలు జరుగుతాయన్నారు. 14, 15 తేదీల్లో ఖవ్వాలి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు


ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


కలశాలతో అష్టోత్తర కలశాభిషేకం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు ఆదివారంతో ప్రారంభమయ్యాయి. నాగుల చవితి సందర్భంగా పాలు పోసి, పూజలు చేశారు. అనంతరం ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల ద్రవ్యాలతో, 108 కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం చేశారు. అనంతరం మూల విరాట్‌కు మంగస్నానాల అనంతరం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో బంగారు ఆభరణాలు అలంకరించి,విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతిదేవికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

23న హుండీ కానుకల లెక్కింపు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల23న ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ఉంటుందని ఆలయ ఈఓ లక్ష్మిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు.